కథానిక - ఆకెళ్ళ శివప్రసాద్

# పోస్ట్‌మార్టమ్

**దొరికితే దొంగ దొరక్కపోతే దొర. నేరం చేసి దొరికిపోయిన దొర సజీవ శవంలా బతుకు ఈడ్చాల్సిందే. దొంగ బతుకు బతకాల్సిందే**

గడియారం వైపు చూశాడు కరుణాకర్. సెకండ్ల ముల్లు ఒక్కటీ కదులుతున్నట్టుగా ఉంది. అసహనంగా సీట్లోంచి లేచాడు. క్యాబిన్‌లో అటూ ఇటు తిరిగాడు. కళ్ళు తిరుగుతున్నట్టుగా ఉంది. గొంతు తడారిపోయింది. నీళ్ళ జగ్గు వంచి గ్లాసులోకి పోశాడు. ఒకే ఒక చుక్క పడింది.

బెల్ కొట్టాడు. క్షణంలో వినయంగా రావలసిన అటెండర్ నర్సింహులు రాలేదు. ఇక్కడికి వచ్చినప్పటి నుంచి అతనో నిర్లక్ష్యమైన చూపు చూస్తున్నాడు.

ఇన్‌స్పెక్షన్ చేయడం కోసం ఓ బ్రాంచీకి వెళ్ళి ఇక్కడికి వచ్చాడు. నర్సింహులు ఇక్కడ కనిపించాడు. అతణ్ణి తన రూమ్ దగ్గర చూసేసరికి ఒళ్ళంతా పాములు, జెర్రులు పాకినట్టు అనిపించింది. మొహం చాటుచేసుకుని క్యాబిన్‌లోకి వెళ్ళాడు. క్యాబిన్ చెత్తకుండీలా ఉంది. అటెండర్ డ్యూటీలో క్యాబిన్ శుభ్రం చేయడం ఒకటి. నర్సింహులు శుభ్రం చేయలేదు. బెల్ కొట్టిన పావుగంటకు వచ్చాడు.

"వాట్ ఈజ్ దిస్?" కోపంగా అరిచాడు నర్సింహుల్ని చూసిన వెంటనే.

నర్సింహులు ఏమీ మాట్లాడలేదు.

"ఊర్వశి ఊర్వశీ టేకిటీజీ పాలసీ." హమ్ చేశాడు.

అతడి కంఠం పట్టుకుని పిసికి అప్పటికప్పుడు అక్కడికక్కడ చంపేయాలన్నంత కోపం వచ్చింది. అతి కష్టంమీద నిగ్రహించుకున్నాడు.

రెండు క్షణాల తరువాత నర్సింహులు ఏమనుకున్నాడో ఏమో చీపురుకట్ట పట్టుకుని మొహమ్మీద చిమ్మడం ప్రారంభించాడు.

అపరిశుభ్రంగానే ఉంది ఇంకా.

మంచినీళ్ళు తెమ్మంటే జగ్గు ఏమాత్రం కడగకుండా తెచ్చినట్టుంది.

అసహనంతో ఉడికిపోతున్నాడు.

తన టేబుల్ తానే తుడుచుకున్నాడు. తుడుచుకుంటున్నంత సేపు నర్సింహుల్ని తిడ్తూనే ఉన్నాడు. ఒకటి రెండు ఫైళ్ళు తిరగేసే ప్రయత్నం చేశాడు. బుర్రంతా ఖాళీగా ఉంది. పేజీలు తిరగేసినా ఏమీ ఎక్కలేదు. నరాలు ఉబ్బినట్టు, తలంతా వాచిపోయినట్టు అనిపిస్తోంది. లంచ్ టైమ్ అయింది.

నిప్పుల పెట్టె మీద వేలుపెట్టినట్టు బెల్ కొట్టాడు. నర్సింహులు రాలేదు. క్యాంటిన్‌కి వెళ్ళి భోజనం చేయడమంత దారుణమైన కార్యక్రమం మరొకటి ఉండదు. అప్పటికే ఇక్కడివాళ్ళు చాటుమాటుగా గుసగుసలాడుకుంటున్నట్టు అనిపించింది.

ఒకప్పుడు తాను అడుగుపెడ్తున్నాడు అని తెలిస్తేనే వణికిపోయేవాళ్ళు ఇప్పుడు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దానికితోడు నర్సింహులు వాళ్ళకి మరీ దగ్గరగా మెసులుతున్నట్టున్నాడు. ఇప్పటికే సవివరంగా చెప్పేసి ఉంటాడు.

పేపర్లో రాకుండా చేయాలని ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. పత్రికాస్వేచ్ఛని ఇంకోసారి బూతులు తిట్టాడు. ఒకవైపు కడుపులో తిప్పుతున్న బాధ, మరోవైపు రాకాసిలా పరుచుకుంటున్న ఆకలి.

లంచ్ టైమ్ అయిన అరగంటకి నర్సింహులు వచ్చాడు.

"ఎక్కడికి వెళ్ళావ్?"

జవాబు లేదు. వెక్కిరిస్తున్నట్టు నవ్వు.

"క్యారేజీ తే..." అన్నాడు.

నర్సింహులు వినయం ప్రదర్శిస్తూనే బ్రేవ్‌మని త్రేన్చి, ఆవులించి "ఇప్పుడే కావాలా" అన్నాడు.

"ఊఁ..." క్యాంటిన్‌కి చీటీ రాసి ఇచ్చాడు. పది నిమిషాల వరకు ఏ సమాచారం లేదు. ఆకలి పెరిగిపోయింది. మంచినీళ్ళకి నోరు చేదుగా అనిపిస్తోంది. పావుగంట గడిచాక ఇంటర్ కమ్ మోగింది.

"మీల్స్ అయిపోయిందట. సమోసా తేనా?" నర్సింహులు కంఠం.

"ఆఁ...ఫోన్ పెట్టేసి మరింత ఉడికిపోయాడు.

వాడి పొజిషన్ ఏమిటి, తన పొజిషన్ ఏమిటి? ఎంత లక్ష్యం లేకపోతే ఆఫీసర్‌కి ఫోన్ చేస్తాడు.?

లంచ్ టైమ్‌లో కదలకపోవడం వల్లే తిండి కరవయింది. కొత్త ప్రాంతం. ఆఫీసుకి దగ్గర్లో హోటల్ ఉందో లేదో తెలీదు. నర్సింహులు క్యాంటిన్‌లో మీల్స్ లేదంటే, ఎక్కడికైనా వెళ్ళి తీసుకు రమ్మనవలసింది. తోచలేదు.

తాను క్యాబిన్ బైటకి వెళ్తే అందరి కళ్ళూ తన మీదే ఉంటాయి. ఆ కళ్ళ చూపులలో వెక్కిరింత, వెటకారం, అసహ్యం కలగాపులగంగా కలిసి ఉన్నాయి.

అసలా నర్సింహులు లేకపోయి ఉంటే కాస్త బావుండేది. అతనూ ఇక్కడుండడంతో ఇబ్బందిగా ఉంది. నరకయాతన పడ్తున్నాడు.

ఆఫీసు ఫైళ్ళ విషయాల గురించి ఎవర్నీ పిలవలేదు. అధికారదర్పం ఏమైంది? ఎందుకిలా నిస్సహాయుడిలా అయిపోయాడు.?

తనమీద తనకే జాలి కలిగింది.

ప్రపంచంలో అన్నింటికన్నా విషాదమైంది తనమీద తనకే జాలీ, ఏవగింపు, అసహ్యం కలగడం కాక మరేమిటి? ఫోన్ చేసిన అరగంటకి రెండంటే రెండు సమోసాలు తెచ్చాడు. అవి చల్లగా ఉన్నాయి. ఏమాత్రం రుచిగా లేవు.

**ఒకప్పుడు తాను అడుగుపెడ్తున్నాడు అని తెలిస్తేనే ఆఫీసులో అంతా వణికిపోయేవాళ్ళు. ఇప్పుడు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.**

ఆకలికి రుచితో ప్రమేయం లేదు. అలాగే తిన్నాడు. రెండు సమోసాలు రెండు నిమిషాల్లో అయిపోయాయి.

ఆకలి మరింత పెరిగిపోయింది. ఈ ఆకలి రెండు నిమిషాల క్రితం రెండు సమోసాలు తిన్నదాని ముందరి స్థితి కన్నా ఎక్కువగా ఉంది. నరాలు మెలిపెడుతున్నాయి.

రెండు సమోసాలకి కక్కుర్తి పడిపోకుండా ఉంటే బావుండేదనిపించింది.

నాలుకకి కాస్త తగిలేసరికి ఆకలి విష వాయువులా కడుపంతా పరుచుకుంది.

"అవే ఉన్నాయ్..." మళ్ళీ ఏమైనా తెమ్మంటాడేమోనని జర్దా పాన్ నములుతూ నర్సింహులు అన్నాడు. కరుణాకర్ జవాబు కోసం చూడకుండా బయటకి వెళ్ళిపోయాడు.

సాయంత్రంవరకు ఎడారిలో గడిపినట్టు గడిపాడు. అందరూ వెళ్ళిపోయి ఉంటారని బయటకి కదిలాడు.

అన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయ్. బయటకి వచ్చాడు. అలవాటుగా కారు కోసం చూపులు సాగాయి. అరక్షణంలో ఈ గ్రేడ్‌లో కారు రాదన్న విషయం గుర్తుకొచ్చింది. నడవడం మొదలుపెట్టాడు.

"వస్తావా గురూ." వెనుక నుంచి నర్సింహులు మాటలు వినిపించాయి. అతడి వైపు చూశాడు. డొక్కు సైకిల్‌ని పుష్పకవిమానంలా కదుపుతూ నవ్వాడు. జవాబు చెప్పకుండా ముందుకు కదిలాడు.

వీధి మలుపు తిరిగింది. నర్సింహులు రోడ్డుకి అటువైపు వెళ్ళాడు. వాడు వెనకే వస్తున్నంతసేపూ కంపరమెత్తి, చల్లని సాయంత్రమైనా చెమటలు పోశాయి. హత్య కేసులో ప్రత్యక్ష సాక్షిని చూసినట్టు వణికిపోయాడు.

తాను గెస్టుహౌస్‌కి వెళ్ళాలంటే అటువైపే వెళ్ళాలి. రైల్వేగేటు కూడా దాటాలి. దారి అంత బాగోదు. అయినా ఇదే నయమనిపించింది. నర్సింహులు నీడ పడకూడదు. అసలు వాడు ఇక్కడ కనిపిస్తాడని ఊహించలేదు.

ముళ్ళకిరీటం నొక్కుకున్నట్టు అనిపిస్తోంది. ఒక్కో ముల్లుకి ఒక్కో నరం తెగుతోంది. రక్తం ధారగా స్రవిస్తోంది.

కంగారుగా దవడలు తడుముకున్నాడు. షేవ్ చేసుకోని గడ్డం కరుకుగా తగిలింది.

భ్రమలో ఉన్నాడా?

కనిపించని గాయం అతలాకుతలం చేస్తోంటే కొంతదూరం నడిచేసరికే అలసట అనిపించింది.

రొడ్డు పక్కగా పాక హోటల్ కనిపించింది. ఎవరేనా చూస్తారేమో- ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్.

పాలు కనిపించాయి. వేడి పాలని అమాంతం నోట్లో పోసుకునే ప్రయత్నం చేశాడు.

నాలుక భగ్గుమంది. నోరంతా మంట.

అశాంతి పెరిగిపోయింది.

తాను మర్చిపోదామనుకుంటున్న సమయంలో నర్సింహులు కనిపించాడు. వాడు... చీకటి లాంటి గతానికి సాక్షి. తనతో పాటే వాడు.

ఛీ!ఛీ!... తనతో పాటే అని అనుకోలేకపోతున్నా, కాదనలేని గతానికి నిదర్శనం!

* * *

"నమస్తే సార్."

"నమస్కారాలు సార్..."

కారులో ఉండగానే వందిమాగధుల్లా వరుసగా నిలబడి వందనాలు చేస్తున్నారు. కారులోంచి దిగి వాళ్ళ వైపు కనీసం చూడకుండా ముందుకు కదిలాడు కరుణాకర్.

ఆఫీసంతా నిలబడి సెల్యూట్ చేసింది.

క్యాబిన్‌లోకి వేగంగా వచ్చాడు. అందంగా, శుభ్రంగా ఉంది క్యాబిన్. ఫినాయిల్ వాసన వస్తోంది. రోజూ శుభ్రంగా కడగవలసిందే. చిన్న పేపరు ముక్క కనిపించినా, అటెండర్ తలని పీకి ఆఫీను గుమ్మానికి వేలాడ కడ్తాడని స్టాఫ్‌కి భయం.

ముందుగా ఆఫీసు సూపరింటెండెంట్ వచ్చాడు. వయసులో చాలా పెద్ద. రిటైర్‌మెంట్‌కి సిద్ధంగా ఉన్నా ఆయన్ని కూర్చోమనలేదు. ఆయనా కూర్చునే సాహసం చేయలేదు. స్టాఫ్‌ని కూచోమంటే కంట్రోల్‌లో ఉండరని భయం. భయం కాదు, కరుణాకర్ నమ్మకం. అందుకే ఓ పరిధి దాటి చనువు ఇవ్వలేదు.

లంచ్ సమయంలో స్పెషల్ క్యారేజీ వచ్చింది. వెజ్, నాన్‌వెజ్ పదార్థాలు వచ్చాయి. సగం సగం తిని వదిలేశాడు.

సాయంత్రం వరకు అలాగే గడిచింది. ఎవరూ కరుణాకర్ ముందు కూచునే ధైర్యం చేయలేదు.

కరుణాకర్ ఓ పేరు మోసిన దేవస్థానంలో పనిచేస్తున్నాడు. రోజుకి లక్షల మీద ఆదాయం ఉంటుంది. కరుణాకర్ సిన్సియారిటీని మెచ్చుకుని, స్పెషల్ ఆఫీసర్‌గా, అతనికి క్యాష్ డ్యూటీ వేశారు.

క్యాష్ డ్యూటీలో భక్తులు వేసే కానుకలని, డబ్బుల్ని ఏమాత్రం తేడాలేకుండా బ్యాంకుకి పంపాలి. చాలా జాగ్రత్తగా చేయాలి డ్యూటీ.


ఆ డ్యూటీలో వేసిన నెల రోజులవరకు అంతా సజావుగా సాగింది. అప్పటికి ప్రొసీజర్ అంతా అర్థమయింది.

ఆ తరువాత ఓ బలహీన క్షణంలో పురుగు లాంటి ఆలోచన మెదడు మొదళ్ళలో మొదలయింది.

బ్యాంకులో రోజూ లక్షలకి లక్షలు జమ చేసే బదులు ఎంతో కొంత తప్పిస్తే-

తన ఆలోచన అమలు చేయడానికి కనీసం నలుగురైదుగురి సహాయం కావాలి. అలాంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్న ఓ సూపరింటెండెంట్, ఓ హెడ్ క్లర్క్, ఓ క్లర్క్ కరుణాకర్‌కి 'సై' అన్నారు. మరి మూటల్ని సురక్షితంగా తన కారు లోకి ఎవరు చేరవేస్తారు? నమ్మకస్థుడైనవాడు కావాలి.

కొత్తగా సర్వీసులోకి వచ్చిన వాళ్ళలో నమ్మకం ఎక్కువగా ఉంటుంది. వాళ్ళకి పరిచయాలు తక్కువగానే ఉంటాయి కనుక పొరపాటున కూడా బైట పొక్కే అవకాశం తక్కువ.


చిత్రాలు: నర్సిం

"నర్సింహులు అని నమ్మకస్థుడండి." వినయంగా అన్నాడు హెడ్ క్లర్క్.

పేరు అనవసరం. పని ముఖ్యం. డబ్బులు లెక్క పెట్టడంలో, ఆ లెక్కల్ని పుస్తకాల్లో రాయడంలో క్లర్క్‌లు, సూపరింటెండెంట్ 'పనితనం' చూపెడ్తే, ఆ లెక్కల్ని కరుణాకర్ సర్దిపై చేశాడు. నర్సింహులు మూటల్ని కారులోకి ఎక్కించాడు.

మొదట్లో రిస్క్‌కి కాస్త భయపడ్డా, ప్రతిఫలం ఒక్కోసారి లక్షల్లో ఉండడంతో సామూహికంగా బరితెగించారు.

ఆ వచ్చేదాంట్లో సగం కరుణాకర్ తీసుకుంటే, మిగిలినవాళ్ళు 'గ్రేడ్స్' ప్రకారం భాగాలు వేసి పంచుకుంటున్నారు. కాలం కొత్త రూపాయి నోటులా తళతళలాడి పోతోంది.

ఆరోజు అంతా బాగానే ఉన్నట్లు అనిపించింది.

ఎక్కడో పొరపాటు జరిగింది. లెక్కల్లో తేడాలు వచ్చాయి. బ్యాంకులో వోచర్‌లో రాసిన దానికన్నా ఎక్కువే జమ అయింది.

తీగ లాగారు. డొంక కదిలింది. దాదాపుగా ఆరేళ్ళపాటు 'మిస్ అప్రాప్రియేషన్ ఆఫ్ క్యాష్' అయినట్టు తెలిసింది. స్కామ్‌లో భాగస్వాము లందర్నీ సస్పెండ్ చేశారు.

కేసు ఏ.సి.బి.కి వెళ్ళింది. అందర్నీ కటకటాల వెనక్కి తోశారు. గుడ్డలు విప్పించారు.

వరుసగా దొంగల నంబర్లు ఇచ్చారు. ఒకే సెల్‌లో ఉంచి ఇంటరాగేషన్ చేశారు.

అప్పటిదాకా ఉన్న ఉద్యోగపు హోదాలు మారి పోయాయి. కరుణాకర్ ఆఫీసర్, నర్సింహులు అటెండర్ అనే తేడాలేదు. అందరినీ చితకబాదారు. జొన్న కూడే పెట్టారు. రెండునెలలు జైలులోనే గడిచాయి.

అప్పటికి పత్రికల ద్వారా దేవస్థానంలో పనిచేసేవాళ్ళు లక్షలకి లక్షలు కాజేసినట్టు తెలిసింది.

అధికారం, అహంభావం ఆవిరైపోయి, పరిస్థితి తలకిందులయిపోయింది. అతికష్టంమీద బెయిల్ సంపాదించి బయటకి వచ్చాడు. ఉద్యోగంలోంచి తీసేసినట్లు ఉత్తర్వు వచ్చింది.

ఆ ఉత్తర్వుకి తలవంచితే జీవితంలో కోలుకోలేడు.

పెళ్ళి చేయవలసిన పిల్లలున్నారు. చాలా సమస్యలు రావచ్చు. న్యాయస్థానంలో రూల్స్ ఎన్ని ఉన్నాయో, వాటిని అతిక్రమించడానికి, పెడర్థాలు తీయడానికి, ఎక్సెప్షన్స్, ఎక్సంప్షన్స్ అన్నీ ఉన్నాయ్.

తన దగ్గర కావలసినంత డబ్బు ఉంది. ఎన్ని లక్షలు ఖర్చయినా ఫర్వాలేదు.

పరువు నిలబడాలి. ఉద్యోగం రావాలి. జీవితంలో మచ్చగా ఇది మిగలకూడదు.

క్రిమినల్స్‌ని, రాజకీయ నాయకుల్ని సంక్లిష్ట సమస్యల నుంచి రక్షించిన లాయర్ని ఆశ్రయించాడు.

కేసు కోర్టుకెక్కింది. వాదోప వాదాలు జరిగాయి.

ఎక్కడో ఉన్న 'రూల్స్'ని గంటకి పైగా ఉటంకించి, కరుణాకర్ నిర్దోషి అని, పోయిన ఉద్యోగం వచ్చేటట్లు ఆదేశాలు జారీచేశారు న్యాయస్థానం వారు.

కోర్టు ఆజ్ఞ లక్షణంగా క్షణాల్లో అమలు జరిగింది.

కరుణాకర్‌తో పాటు సహ బాధితులకి ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది.

దేవస్థానానికి ఏమాత్రం దగ్గర్లో ఉంచినా, ఆ దేవుడిని, దేవాలయాన్ని స్వాహా చేస్తారని దూరప్రాంతాలకి పోస్టుచేశారు.



కరుణాకర్‌ని మొదట ఇన్స్‌పెక్షన్‌కి వేశారు. ఏదో బ్రాంచిలో అవకతవకలు జరిగాయని తెలిసి అక్కడికి వెళ్ళాడు.

ఆ బ్రాంచి ఇన్‌చార్జ్ అతి వినయం ప్రదర్శించాడు. అనవసరంగా పొగిడాడు. విందు, మందు, పొందు సిద్ధం అన్నాడు. కరుణాకర్ ఏదో చెప్పబోతుంటే, "సార్...సస్పెండ్ చేయొద్దు సార్. ఆ బాధ మీకు తెలును. తిన్నాను. ఒప్పుకుంటున్నా. ఒకసారి అనుభవించారు కనుక కనికరించండి" అన్నాడు కాస్త వ్యంగ్యంగా బాధ నటిస్తూ.

ఎక్కడో ఉన్న ఈ బ్రాంచికి తన గురించి తెలిసిందంటే దావానలంలా ఎలా వ్యాపించిందో ఊహించగలడు.

ఇన్స్‌పెక్షన్ వద్దన్నాడు వెంటనే.

వేరే బ్రాంచికి వేశారు. ఆ బ్రాంచిలో ఒకే నేరానికి ఒకే సెల్‌లో గడిపిన నర్సింహులు ప్రత్యక్షమయ్యాడు.

సెల్‌లోనే 'గురువా' అన్నవాడు, ఇంక తనకేం విలువ ఇస్తాడు.?

"చూసుకుని నడవవయ్యా బాబు." ఎదురుగా గుద్దేయడానికి వచ్చిన మనిషి గావుకేక పెట్టాడు. కంగారుగా పక్కకి నడిచాడు కరుణాకర్.

దారిలో మెస్ కనిపించింది.

భోజనం చేసి గెస్ట్‌హౌస్‌కి వెళ్ళిపోదామనుకున్నాడు.

బడలికగా ఉంది. కళ్ళు మండుతున్నాయ్.

మెస్ ఖాళీగా ఉంది. వేడిగా ఉంది భోజనం. పూర్తి చేశాడు.

ఆబగా అన్నం తింటుంటే సర్వర్ నవ్వడం గమనించినా పట్టించుకోలేదు.

మెస్ బయటకి వచ్చాడు.

చీకటిగా ఉంది.

చలిగా ఉంది.

వీధి దీపాలు వెలగడం లేదు.

గతుకుల రోడ్డు మీద నడుస్తున్నాడు. భుక్తాయాసంగా ఉంది. కళ్ళు మూతలు పడ్తున్నాయ్.

నర్సింహులు గుర్తొచ్చినప్పుడల్లా చెమటలు పడ్తున్నాయ్. రైల్వేగేటు దగ్గరకి వెళ్తుండగా పెద్దగా ఏడుపులు, పెడబొబ్బలు వినిపిస్తున్నాయ్.

స్తబ్దుగా ఉన్నా బుర్ర వేడెక్కి బరువెక్కిపోతోంది.

**కళ్ళు మూతలు పడ్తున్నాయ్. నర్సింహులు గుర్తొచ్చినప్పుడల్లా చెమటలు పడ్తున్నాయ్. బుర్ర వేడెక్కి బరువెక్కిపోతోంది.**

రైల్వేగేటు దగ్గర గుంపుగా జనం ఉన్నారు.

ఎవరో అటుగా వెళ్తున్న రైలు కింద పడ్డారట. తల, మొండెం చెల్లాచెదురయిపోయాయి.

రక్తం మరకలు ఉన్నాయ్. భరించలేని వాసన ముక్కుపుటాల్లో చొరబడి కడుపులో తిప్పేస్తోంది.

ఒక్కో అవయవాన్ని టార్చిలైటు వెలుగులో వెతికి ఒక చోట చేరుస్తున్నారు. అయినవాళ్ళ ఏడుపు చీకటి కన్నా భయంకరంగా ఉంది.

రెండు అడుగులు వేశాడు. అక్కడే ఉన్న కానిస్టేబుల్‌ని ఎవరో ముసలాడు బతిమాలుతున్నాడు. కానిస్టేబుల్ వాడిని పురుగులా చూస్తూ "...శవాన్ని ఇవ్వడం కుదరదు. పోస్టుమార్టమ్ అవ్వాలి, రిపోర్టు రాయాలి, పంచనామా చేయాలి, చాలా తతంగముంది" అంటున్నాడు.

చాలా తతంగముంది.

పోస్టుమార్టమ్ అవ్వాలి

రిపోర్టు రాయాలి.

పంచనామా చేయాలి.

బతికున్న 'శవాలకి' కూడా ఇవన్నీ వర్తించవూ?

అన్యాయంగా గడించి, దొరికిపోయి, సస్పెండ్ అయి, దినమొలతో జైలులో నిలబడి, కోర్టుని ఆశ్రయించి, ఉద్యోగంలో చేరి, ఎవరికో సమాధానం చెప్పుకోవాలని తనకి తాను పోస్టుమార్టమ్ చేసుకోవడం లేదూ?

చెదిరిపోయిన అవయవాల్ని దగ్గరకి చేరుస్తున్నారు...

కరుణాకర్ మనసు అతని కేమాత్రం అందకుండా దూరంగా పరిగెడుతోంది.

కొన్ని కథలు ఫుల్‌స్టాప్‌తో కాక కామాతో ఆగిపోతాయి.

ఈ కథా అంతే! ■